క్లుప్తంగా

డివిజన్‌లో కార్పొరేట్ ఎస్టేట్ జీఎం పర్యటన



మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లో కార్పొరేట్ ఎస్టేట్ జీఎం వెంకటయ్య శుక్రవారం పర్యటించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పలు డివిజన్‌లలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్జీ–3 డివిజన్‌లో పర్యటించారు. భూ సేకరణపై అధికారులతో చర్చించారు. రత్నాపూర్, పన్నూర్, బిట్టుపల్లి ఆర్‌అండ్‌ఆర్ సైట్ పనులు పరిశీలించారు. ఆయన వెంట ఎస్టేట్ అధికారులు కనవేన ఐలయ్య, శ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్ కోల శ్రీనివాస్, జూనియర్ ఎస్టేట్ అధికారి ఎస్.శ్యామల తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న కళాజాత ప్రదర్శన



కళా ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఎలిగేడు: మండల కేంద్రంలో శుక్రవారం సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై నిర్వహించిన కళాజాత ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది. 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, బేటీ బచావో బేటీ పడావోపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు ఆటపాటల అవగాహన కల్పించారు. కళాకారులు కోండ్ర వెంకన్నగౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, నరేంద్ర రాజన్న, జిన్నా రమ, దీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక, ఈదునూరి పద్మ పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు పార్థివదేహం అప్పగింత



కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన ఇల్లందుల శాంతయ్య గౌడ్(85) అనే గీతకార్మికుడు గురువారం రాత్రి మృతి చెందాడు. శాంతయ్య కోరిక మేరకు మృతదేహాన్ని సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి భీష్మాచారి నేతృత్వంలో శుక్రవారం ప్రతిమ వైద్యకళాశాలకు అప్పగించారు. శాంతయ్య కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. ఎంపీటీసీ రావి సదానందం, నాయకులు లాల్ మియా, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సలహాదారులు రమేశ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ అందిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కాలనీలోని శ్రీసత్యసాయి సేవా సమితి షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్‌ను ఈనెల 15 నుంచి మే 20 వరకు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం హర్షిత్‌రెడ్డి సెల్ నెంబర్ 8519 961348, ఉదయ్ కుమార్ సెల్ నంబర్ 95506 42890, సుబ్బారావు సెల్ నెంబర్ 94408 39959 ఫోన్ నంబర్లో సంప్రదించాలని సూచించారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

సుల్తానాబాద్: పట్టణంలో అంబేడ్కర్ జయంతి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి, చుట్టుపక్కలా మున్సిపల్ సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రంగులు వేయించారు. 14న అంబేడ్కర్ జయంతి కార్యక్రమానికి ప్రజలు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

జూలపల్లి: యోగ, ధ్యానంతో మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యంగా ఉంటామని హార్ట్‌ఫుల్ మెడిటేషన్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ పి.రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుమ్మరికుంటలో శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు యోగ, ధ్యానం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక రామాలయంలో ప్రారంభించారు. మాజీ సర్పంచ్ మేచినేని సంతోష్‌రావు, గ్రామ సీసీ పాపయ్య, పెద్దపల్లి ఆశ్రమ కోఆర్డినేటర్ అంజనాదేవి, మేనేజరు మహేశ్, శివప్రసాద్, ఎంపీటీసీ మల్లేశ్ యాదవ్, నాగలక్ష్మి, స్వప్న తదితరులు ఉన్నారు.

వారధి నిర్మాణంపై నీలినీడలు



గోదావరి నదిపై ప్రతిపాదిత వంతెన నిర్మాణ ప్రదేశం



గోలివాడలో భూసేకరణలో నిర్వాసితులు (ఫైల్)

- ముందుగా అంతర్గాం–మంచిర్యాల మధ్య వంతెన నిర్మాణానికి ప్రతిపాదన
- మంచిర్యాల ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య వార్‌తో..
- ప్రస్తుతం ముర్మూర్–ముల్కల్ల మధ్య వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు
- నూతన అలైన్‌మెంట్‌తో ప్రభుత్వంపై ఆర్థికభారం

రామగుండం: అంతర్గాం–మంచిర్యాల మధ్య గోదావరి నదిపై హైలెవల్ వంతెన నిర్మాణంపై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మధ్య కొంతకాలంగా వార్ కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యేకు చెందిన భూములు అంతర్గాం వద్ద ఉండడంతోనే వంతెన నిర్మాణంతో లబ్ధి పొందాలని చూస్తున్నారంటూ ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆరోపిస్తున్నారు. కాగా ఇప్పటికే వంతెన నిర్మాణానికి పూర్తయిన అలైన్‌మెంట్‌తో సిటీ మధ్యలో నుంచి భారీ వాహనాల రద్దీతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని, ఫలితంగా అలైన్‌మెంట్‌ను ముర్మూర్–ముల్కల్ల వద్ద హైవేకు కలిపేలా మార్చాల్సి ఉందన్నారు. ఇరువురి మధ్య వంతెన వార్‌తో అసలు హైలెవల్ వంతెన నిర్మాణం జరుగుతుందా అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

10నెలల క్రితం నిర్మాణ పనులు ప్రారంభం

2023 జూన్‌9న అప్పటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా వర్చువల్ విధానంలో మంచిర్యాలలో హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం చేసిన విషయం తెలిసిందే. ఏడేళ్ల క్రితం గోదావరినదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.125 కోట్లు కేటాయిస్తున్నట్లు అప్పటి సీఎం ప్రకటించారు. గతేడాది టెండర్లను ఆహ్వానించగా నదిలో బ్యాక్ వాటర్ కారణంగా ప్రభుత్వం ప్రకటించిన నిధులు సరిపోవంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ప్రభుత్వం కాంట్రాక్టర్లతో జరిపిన చర్చలతో కేటాయింపులు పెంచుతూ రూ.164కోట్లతో వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు పనులు అప్పగించారు.

ముర్మూర్–మల్కల్ల మధ్య వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు..

అంతర్గాం–మంచిర్యాలకు గోదావరిపై నిర్మించే హైలెవల్ వంతెన అలైన్‌మెంట్‌ను మార్పు చేయించేందుకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ఇటీవల మంచిర్యాల ఎమ్మెల్యే ప్రెస్‌మీట్‌లో పేర్కొన్నారు. రూ.164 కోట్లతో ఇప్పటికే వల్లభనేని కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులను దక్కించుకోగా వాటిని రద్దు చేసి ముర్మూర్–మల్కల్ల మధ్య వంతెన నిర్మాణానికి రూ.450కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఇప్పటికే సదరు సంస్థ భూపరీక్షలు, ఇతరత్రా అనుమతులతో కొన్ని నిధులు ఖర్చు చేయగా పనులు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్న క్రమంలో ఇరువురి మధ్య వంతెన వార్‌తో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో రెండు జిల్లాల ప్రజలు ప్రజాప్రతినిధుల వైఖరిపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నూతన అలైన్‌మెంట్‌తో ప్రభుత్వంపై ఆర్థికభారం..

గోదావరిపై వంతెన నిర్మాణం మళ్లీ మొదటికి రావడంతో పాటు గతంతో పోల్చితే నూతన అలైన్‌మెంట్‌తో ప్రభుత్వ ఖజానాపై ఆర్థికభారం పడనుంది. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో తెలియడం లేదు. కాగా నూతన అలైన్‌మెంట్ ప్రకారం పార్వతీ పంపుహౌస్ అప్రోచ్ కాలువ వద్ద నీటి ఒత్తిడి ఎక్కువ ఉండడంతో సదరు ప్రదేశంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ గతంలోనే ఇంజనీర్లు పేర్కొన్నారు. నూతన అలైన్‌మెంట్ పేరుతో మళ్లీ వంతెన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారగా రాజకీయ వైషమ్యాలతో వంతెన నిర్మాణం కలగానే మారనుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సింగరేణిలో రాజకీయ జోక్యం తగ్గలేదు



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా చేస్తామని చెప్పి గుర్తింపు యూనియన్‌గా గెలిచిన ఏఐటీయూసీ ఇప్పుడు పట్టించుకోవడంలేదని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి విమర్శించారు. శుక్రవారం జీడీకే రెండో గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గెలిచిన సంఘానికి రెండేళ్ల కాలపరిమితితో గుర్తింపు పత్రం ఇవ్వాలన్నారు. ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. దీంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్మిక సమస్యల పరిష్కారంపై దృష్టిసారించి ప్రభుత్వంతో పోరాడేందుకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన పిట్ కమిటీ సభ్యులను మేనేజర్‌కు పరిచయం చేశారు. నాయకులు మెండె శ్రీనివాస్, ఆరెపల్లి రాజమౌళి, ఆసరి మహేశ్, కారం సత్తయ్య, పి.శ్రీనివాసరావు, వంగల రాములు, ఎ.శంకరన్న, పి.సమ్మయ్య, కె.కుమార్, భీమా నాయక్, జనార్దన్, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటమిని జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మారం: ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక తిరిగి డబ్బు సంపాదన కోసమే పెద్దపల్లి ఎంపీగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ధర్మారం మండల కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ సీనియర్ నాయకుడు దేవి జనార్దన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడ్య రూప్లానాయక్, బ్లాక్ 2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. మోసపూరిత మాటలతో కాకుండా ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా ఓటమి చెందిన తర్వాత మూడు నెలలు నియోజకవర్గాన్ని పట్టించుకోక ఎంపీ టికెట్ రాగానే ప్రజల ముందుకు వచ్చి మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తుంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్‌పై, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. పార్టీ నాయకులు ఓరం చిరంజీవి, కాంపెల్లి రాజేశం, కరాటే వేణు, ఎండీ అప్షు, కాంసాని ఎల్లయ్య, ఈదుల శ్రీనివాస్, ఒట్నాల శంకరయ్య, సోగాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సదయ్యగౌడ్‌కు ఉగాది నంది అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న సదయ్యగౌడ్

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన ఏగోలపు సదయ్య గౌడ్‌కు జాతీయ ఉగాది నంది అవార్డును అందజేసినట్లు కళానిలయం కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు పుష్పలత, కార్యదర్శి సురేందర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రామానుజరావు కళామందిరం, తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలో జాతీయ ఉగాది నంది అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏగోలపు కుమార్‌గౌడ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 20ఏళ్ల నుంచి చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు అందజేశారని సదయ్య గౌడ్ పేర్కొన్నారు.

అలవెన్సులు, వేతనం చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

జ్యోతినగర్: మూడునెలల అలవెన్సులు, ఒక నెల వేతనం చెల్లించాలని కాంట్రాక్టు కార్మికులు నిరసన చేపట్టారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని సివిల్ కార్యాలయం ఎదుట హార్టికల్చర్, హౌస్ కీపింగ్‌కు చెందిన 70మంది కార్మికులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడారు. జనవరి నుంచి ప్రతినెలా చెల్లించాల్సిన అలవెన్సులు ఒక్కో నెల ఒక్కొక్కరికి రూ.7035లతో పాటు మార్చి వేతనం చెల్లించలేదన్నారు. అలవెన్సు బకాయిలు వెంటనే చెల్లించాలని, పండుగ రోజుల్లో విధులు నిర్వహిస్తే పీహెచ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

15వ తేదీరోజు చెల్లింపు చేస్తాం

కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన అలవెన్సులు, మార్చి వేతనం 15వ తేదీన ఖాతాలో జమ చేస్తాం. కార్మికులకు కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారు. అలవెన్సుల చెల్లింపులో కొంత జాప్యమైంది. త్వరలోనే సమస్య పరిష్కరించి కార్మికులకు బకాయిల చెల్లింపు జరుపనున్నాం.

– కార్తీక్, సైట్ సూపర్‌వైజర్

యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సురేశ్



నియామక పత్రం ఇస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

యైటింక్లయిన్‌కాలనీ: యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామగిరి మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన సుందిళ్ల సురేశ్‌ను నియమించినట్లు మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం నియామక పత్రాన్ని సురేశ్‌కు అందజేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ విరమణ రోజే సీపీఆర్ఎంఎస్ కార్డులు

- ట్రస్ట్‌బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు

గోదావరిఖని: ఉద్యోగ విరమణ పొందిన రోజే సింగరేణి కార్మికులకు సీపీఆర్ఎంఎస్ కార్డులు అందించడానికి యాజమాన్యం అంగీకరించినట్లు గుర్తింపు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం కొత్తగూడెంలో సీపీఆర్ఎస్ ట్రస్ట్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు కీలక అంశాలపై సమీక్షించారు. ఉద్యోగ విరమణపొంది కార్మికులు ఇబ్బంది పడకుండా పలు సమస్యలపై యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నారు. సమావేశంలో యాజమాన్యం తరఫున డైరెక్టర్(పా) ఎన్ వీకే శ్రీనివాస్, వెల్ఫేర్ జీఎం బసవయ్య, సీపీఆర్ఎస్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఏఐటీయూసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన అంశాలివే..

- ప్రతీ మూడు నెలలకోసారి ట్రస్ట్ బోర్డు సమావేశం నిర్వహించాలి
- క్యాన్సర్, కిడ్నీ లాంటి మొండిజబ్బుల విషయంలో డబ్బులను ట్రస్ట్ భరించేందుకు అంగీకారం
- 2018 నుంచి ఇప్పటివరకు మొండిజబ్బుల విషయంలో రూ.8లక్షల నుంచి ఖర్చు అయిన వారి అకౌంట్లలో తిరిగి డబ్బు జమచేయడానికి నిర్ణయం
- సుమారు 5వేల మంది రిటైర్డు కార్మికుల లైవ్ సర్టిఫికెట్ జతపర్చలేదని, వారిపేర్లు ఏరియాల వారీగా ప్రకటించనున్నారు.
- వాళ్లు వెంటనే ఫోన్‌నంబర్లతోసహా లైవ్ సర్టిఫికెట్లు జతపర్చాలి
- బీపీ, షుగర్ బాధితుల నెలవారీ టాబ్లెట్లు ఏఏరియాలో ఉంటే అదే హాస్పిటల్‌లో ఇవ్వాలని, హైదారాబాద్‌లో చాలామంది రిటైర్ కార్మికులు నివసిస్తున్నారని, వారికి హైదారాబాద్‌లోనే ఇవ్వాలనే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకునేందుకు అంగీకారం
- రిటైర్డు కార్మికులు ఏదైనా జబ్బుతో సింగరేణి హాస్పిటల్‌లో అడ్మిట్ అయితే 40శాతం డబ్బులను సీపీఆర్ఎంఎస్ ఫండ్‌లో నుంచి రికవరీ చేసేందుకు కోల్ ఇండియాలో పద్ధతి అమలు
- సీఆర్ఎంఎస్ కార్డులో ఎంతమొత్తం ఉందో మేసేజ్ ద్వారా తెలియజేసేలా అంగీకారం
- అన్నిఏరియాల్లో పెండింగ్ సిఎంపీఎఫ్ లోన్ల విషయంలో అధికారులు కోల్ ఇండియా వెళ్లారని, వారు రాగానే ఎలా చేయాలో చెబుతారు.
- సీఎంపీఎఫ్ చిట్టీలు 2022–23 వెంటనే అందజేస్తామని, 2023–24 త్వరలోనే ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నారు.

డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీగా దినేశ్‌కుమార్



రామగుండం: ఆలిండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీగా రామగుండంకు చెందిన లోకోపైలట్ మాతంగి దినేశ్‌కుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా సహచర లోకోపైలట్లు రవి, జగన్, వినోద్‌కుమార్, కరుణాకర్, వినోద్ తదితరులు దినేశ్‌ను అభినందించారు.

బాలల స్నాతకోత్సవం

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ పాఠశాలలో శుక్రవారం బాలల స్నాతకోత్సవం నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు వినయ్, సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్య కార్యకర్తల సమావేశం విజయవంతం చేయండి

రామగిరి: మంథని శివకిరణ్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణతో పాటు పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ముఖ్య కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించనున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతిలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొంటారని, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు ఆర్జీ–1లో క్వార్టర్ల కౌన్సెలింగ్

గోదావరిఖని: రోడ్డు వెడల్పులో సింగరేణి క్వార్టర్లు కూల్చివేతకు గురవుతున్న క్రమంలో అందులో ఉంటున్న కార్మికుల కోసం శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక శివాజీనగర్, హనుమాన్‌నగర్, గాంధీనగర్‌లోని క్వార్టర్లలో నివాసముంటున్న కార్మికులకు ఈ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చివరి అవకాశంగా నిర్వహించే క్వార్టర్స్ కేటాయింపు కోసం శనివారం సాయంత్రం 4గంటలకు స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్పెషల్ కౌన్సెలింగ్‌లో ఉద్యోగులకు నచ్చిన క్వార్టర్లను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. సెక్టార్–1లో 29 క్వార్టర్లు డీటైపు, ఎస్‌టీటూ, టీటూ, ఎండీ, సెక్టార్–2లో 39మందికి హయ్యర్ టైపు ఎంసీ, సీ, ఎస్సీటూ, బీసీహెచ్ క్వార్టర్‌లు కేటాయించేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ వైఫల్యంతోనే సాగునీటి కొరత



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జూలపల్లి: సాగునీటి ఎద్దడికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలతోనే ప్రస్తుత నీటికరువుకు మూలమని కాంగ్రెస్ యూత్ నియోజకవర్గ అసెంబ్లీ కార్యదర్శి గాగిరెడ్డి దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ తక్కువ ఉన్నందున తాగునీటి అవసరాలను దృష్టిలో పెటుకుని సాగునీటికి ముందస్తుగా రైతులకు సమాచారం ఇచ్చారని, కావాలని కొందరు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, ఫకీర్‌మహ్మద్, పొరండ్ల స్వామి, నెరువట్ల రాజు, పొట్యాల బీరయ్య, గుంటి వెంకన్న, చింతమల్ల రాములు, మెండె లచ్చయ్య ఉన్నారు.

ఇసుక క్వారీని మూసివేసే దాకా ఉద్యమిస్తాం



నిరసన దీక్ష చేస్తున్న గ్రామస్తులు

సుల్తానాబాద్‌రూరల్: మానేరులోంచి ఇసుకను తరలించడంతో భూగర్భజలాలు అడుగంటడంతో తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు రిలే నిరసన దీక్షలు చేపట్టారు. సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి మానేరు వాగులో 10రోజులుగా గ్రామస్తులు టెంట్ వేసుకొని నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక క్వారీని ముసివేసేదాకా ఉద్యమిస్తాం అని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు గ్రామ శివారులో, సంతోష్‌నగర్ ఏరియాల్లో ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి శుక్రవారం గుడుంబా స్థావరాలపై దాడి చేశారు. ఎక్సైజ్ పోలీసుల వివరాల ప్రకారం గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ సీఐ మంగమ్మ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాస్ గుడుంబా స్థావరాలపై దాడి నిర్వహించారు. 4 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్స్ ఖాదిర్, ప్రసాద్ కానిస్టేబుల్స్ శ్రావణ్, రాజు, రాజ్‌కుమార్ ఉన్నారు.

క్రికెట్ బ్యాట్‌తో దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

గోదావరిఖని: క్రికెట్ బ్యాట్‌తో దాడిచేసిన ఇద్దరిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై సౌజన్య తెలిపారు. స్థానిక జీఎం కాలనీ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న ఇరువర్గాల మధ్య గొడవ పెరగడంతో క్రికెట్ బ్యాట్‌తో మాద్దుల సాగర్, అతని అల్లుడు(15) దాడిచేయడంతో గుండబోయిన కుమారుడు(15) గాయపడినట్లు వివరించారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

గోదావరిఖని: బంగారు ఆభరణాలు చేయాలని అడిగినందుకు దాడిచేసిన నగల వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన గాదెం శ్రీనివాస్ ఆభరణాల తయారీకి బంగారం ఇచ్చాడు. ఆభరణాలు చేయకపోవడంతో బంగారం వ్యాపారి ఉప్పుల రాముని ప్రశ్నించగా శ్రీనివాస్‌పై దాడిచేసినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాముపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల, పెద్దబొంకూర్, నిమ్మనపల్లి, నిట్టూరుతో పాటు పెద్దపల్లి శివారు చందపల్లి, రంగంపల్లి, పెద్దపల్లి విద్యుత్‌సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గోదావరిఖనిలో..

గోదావరిఖనిటౌన్: నగరంలోని పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు సంపత్, కె.మహిపాల్‌రెడ్డి, ఎ.దేవస్వామి తెలిపారు. రాంమందిర్ ఏరియా పరిధిలోని లక్ష్మీనగర్, ఓల్డ్ అశోక థియేటర్ ఏరియా, గౌతమినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ ఫీడర్ పరిధిలోగల లక్ష్మీపురం గేట్, ప్రగతినగర్, మాతంగికాలనీ, కాజిపల్లి ప్రాంతాలు అలాగే పీజీ సెంటర్ సబ్‌స్టేషన్ పరిధి పవర్‌హౌస్‌కాలనీ, జైభీమ్‌నగర్, బస్టాండ్ కాలనీ, సప్తగిరికాలనీ, జీఎం కాలనీ, బాపూజీ నగర్, సీఎస్‌పీ కాలనీ, ఫీడర్లలో మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు.

రామగుండం పరిధిలో..

రామగుండం: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతు పనుల కారణంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ ఏఈ బేతి దామోదర్‌రావు తెలిపారు. మల్యాలపల్లి, బ్రద్రిపల్లి, మొగల్‌పహాడ్, కుందనపల్లి, అక్బర్‌నగర్, రైల్వేస్టేషన్ ఏరియా, విద్యుత్‌నగర్, అయోధ్యనగర్, జీరోపాయింట్, హౌసింగ్‌బోర్డు, లింగాపూర్, విలేజీ రామగుండం, సండే మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మంథని మండలంలో..

మంథని: మంథని మండలం గుంజపడుగు, నాగారం విద్యుత్ ఉప కేంద్రాల్లో అత్యవసర మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 6 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ మల్లయ్య తెలిపారు.

కమాన్‌పూర్ మండలంలో..

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతు పనులు చేయనున్నారు. కాగా సబ్‌స్టేషన్ పరిధిలోని కమాన్‌పూర్, గుండారం, జూలపల్లి, పేంచికల్‌పేట, సిద్ధిపల్లె గ్రామాల్లో ఉదయం 7గంటల నుంచి ఉదయం 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

అంబలి పంపిణీ, చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, ఉచిత అంబలి కేంద్రాన్ని శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ప్రతి ఏడాది వేసవిలో ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసి బ్యాంకు, ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారితో పాటు దారివెంట వెళ్లే వారి దాహార్తి తీర్చడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, జంగపెల్లి శ్రీనివాస్, సతీశ్, రంగు సత్యనారాయణ, నీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.